నేషనల్ 'డాక్టర్స్ డే' Happy Doctors Day శుభాకాంక్షలు... Special Feature

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై పది వినతిపత్రాలు వచ్చాయి. టిడ్కో గృహాలకు సంబంధించి ఒకటి, ఇంజనీరింగ్ విభాగంలో రెండు, ప్రజారోగ్యంపై ఐదు వినతులు, పింఛన్లపై రెండు, మొత్తం పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం వ్యాధుల నివారణ మన చేతుల్లోనే

తణుకు అర్బన్: వర్షాకాలం వ్యాధుల నివారణ మన చేతుల్లోనే ఉందని, అప్రమత్తంగా వ్యవహరిస్తే వ్యాధులకు లోనవ్వాల్సి వస్తుందని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 14, 29 వార్డుల్లో సోమవారం మలేరియా మాసోత్సవం జూన్ 2025అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధుల నివారణకు ప్రతి రోజూ డ్రైడే గా పాటించాలని, వారం రోజుల పైబడి స్తబ్ధతతో ఉన్న నీటి నిల్వలు ఉంటే వెంటనే తొలగించుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఖర్చు రహిత పద్ధతిలో ఇంటి ఆవరణలో దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని, దోమకాటు రక్షణ కొరకు దోమ తెరలను వాడాలని, స్లీవ్ దుస్తులు ధరించాలని, దోమ వికర్షకాలైన బంతి, పుదీనా, తులసి మొక్కలను పెంచుకోవాలని, చలి జ్వరం ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి గానీ, అర్బన్ హెల్త్ సెంటర్స్‌కు గానీ వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అతిసారం, టైఫాయిడ్, జాండిస్ మొదలగు వ్యాధుల బారిన పడకుండా చేతుల శుభ్రత, ఆహార పదార్థాలను ఉంచిన పాత్రలపై విధిగా మూతలు ఉంచడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు జె.శాంత కుమారి, బి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.


తణుకులో మురుగుతో నిండిన డ్రెయినేజీని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ రెటీనా సమ్మిట్‌కు డాక్టర్ సందీప్

తాడేపల్లిగూడెం: విశాఖలో రెండు రోజుల పాటు జరిగిన మూడవ జాతీయ రెటీనా సమావేశానికి పట్టణానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ సందీప్ హాజరయ్యారు. రెటీనల్ డిటాచ్‌మెంటు సర్జరీపై డాక్టర్ సందీప్ మాట్లాడారు.

ఎస్‌కేఎస్‌డీలో జాతీయ సాంఖ్యక శాస్త్ర దినోత్సవం

తణుకు అర్బన్: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సోమవారం జాతీయ సాంఖ్యక శాస్త్ర (స్టాటస్టిక్స్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీ సుందరీబాయ్ మాట్లాడుతూ మానవ జీవితంలో స్టాటస్టిక్స్ ప్రాముఖ్యత ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో ఆర్థిక సాంఘిక, సామాజిక, సాంకేతిక రంగాలకు దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలను అంచనా వేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం స్టాటిస్టిక్స్ అధ్యాపకులు సీహెచ్ నాగరాజు ఈ శాస్త్ర ప్రాముఖ్యతను, దేశాభివృద్ధిలో దీని పాత్ర, ఉపాధి అవకాశాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, జెస్టిఫర్ మినిట్, పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు ప్రిన్సిపల్ సుందరీబాయ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.దీప్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నారులు బడిలోనే ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: బడిఈడు కలిగిన చిన్నారులు బడిలోనే ఉండాలని ఎంఈవో వి.హనుమ అన్నారు. సోమవారం మండలంలోని నీలాద్రిపురం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఉప్పలపాటి శ్రీధర్, అబ్బిన వీరవెంకట్రావు సహకారంతో నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో హనుమ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు దాతలు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. తద్వారా చిన్నారుల విద్యాభ్యాసానికి ఊతమిచ్చిన వారవుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని విధిగా పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి, ఉపాధ్యాయులు వై.కనకదుర్గ, కే.కరుణ, పుల్లంరాజు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ జూలై 9వ తేదీన జరగబోవు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు 11 జాతీయ కార్మిక సంఘాలు, రాష్ట్ర ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారని, దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యాసరపు ఎర్ర నాయుడు, బత్తినాగ సత్యనారాయణ, వై.ఫైడన్న, ఎమ్.గణపతి, లచ్చిపతుల శ్రీను, నాగిరెడ్డి సాయి, బొబ్బిలి తాతారావు, నౌడు రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

అత్తిలి: ఆరవల్లి గ్రామంలో అన్నదమ్ములు భావంతో ఉండవలసిన మాల మాదిగలు, కొంతమంది మాదిగలు మాలలపై మారణ ఆయుధాలతో దాడి చేయటం దారుణం అని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్ తీవ్రంగా ఖండించారు. ఆరవల్లి గ్రామంలో దాడికి గురైన బాధిత కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించి అనంతరం దళితవాడలో ఏర్పాటు చేసిన నాలుగో రోజు సంఘీభావ దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడికి బెయిల్ రద్దు చేసి రిమాండ్‌కి పంపించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సాహిత్య వేదిక అధ్యక్షుడు కవి కోలాటి పెద్దిరాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, ఉండి నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు జొన్నల వజ్రం, భీమవరం యువజన విభాగం అధ్యక్షుడు పిట్టా వినోద్ కుమార్, భీమవరం పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఈది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

గర్భధారణ సమయంలో దంత సంరక్షణ ముఖ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భం దాల్చిన స్త్రీలలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయని, వాటిలో దంతాల సమస్యలు కూడా ఉంటాయని శ్రీశ్రీ డెంటల్ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నలభై శాతం గర్భిణీ స్త్రీలలో దంత సమస్యలు సాధారణంగా ఉంటాయని, ఆ సమయంలో వారు దంత వైద్యులను సంప్రదించకపోవడం వల్ల చాలా రకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గర్భధారణ సమయంలో నోటిలో వచ్చే మార్పు లు, వాటికి గల కారణాలను ఈ సందర్భంగా వివరించారు.

ఎంపీడీవో బాలాజీ సేవలు అభినందనీయం

పెంటపాడు: మండలంలోని డివిజనల్ పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా, పెంటపాడు ఎంపీడీవోగా బాలాజీ వెంకటరమణ సేవలు అభినందనీయమని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. సోమవారం రాత్రి పెంటపాడు మండల పరిషత్ ప్రాంగణంలో ఎంపీడీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన బాలాజీ అభినందన సత్కార సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పెంటపాడు మండల కార్యదర్శుల సంఘం, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.